క్లుప్తంగా

ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న స్పందించే హృదయం సంస్థ సభ్యులు

మునగపాక: పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఏకాగ్రత ఎంతో అవసరమని విశ్రాంత డీఈవో శిష్టా తమ్మిరాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతుల ముగింపులో భాగంగా నిర్వహించిన పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తమ్మిరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.వి.రమణ, ఆడారి దక్షిణామూర్తి, ఎం.వై.రాము, శివకోటి దుర్గా ప్రసాద్, మాడెం జోగారావు, పిల్లా జగదీష్ , సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారంపై అప్రమత్తం



పెదపల్లిలో ఎలుగు సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లి సమీపంలో ఎలుగుబంటి సంచరిస్తున్నందున అందరూ అప్రత్తమంగా ఉండాలని అటవీశాఖ అధికారులు మైకు ద్వారా ప్రచారం చేశారు. ఎలుబంటి సంచరించిన ప్రాంతానికి ఆదివారం కూడా అటవీశాఖ అధికారులు వెళ్లి పరిశీలించారు. మళ్లీ ఎలుగుబంటి కనిపించిందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు యలమంచిలి అటవీ పరిధి అధికారికి స్థానిక అధికారులు సమాచారం ఇచ్చారు.గతంలో ఎప్పుడూ పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో ఎలుగుబంట్ల జాడ లేదని, కానీ ఇక్కడకు ఎలుగు ఎలా వచ్చిందన్న విషయంపై అటవీ ఉన్నతాధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఏడుమూళ్ల ఆనకట్టను నిర్మించాలి

రాంబిల్లి: కొత్తూరు వద్ద వరదల కారణంగా ఐదు ఏళ్ల క్రితం కొట్టుకుపోయిన ఏడుమూళ్ల ఆనకట్టను పునఃనిర్మించాలని జిల్లా రైతు సంఘం ప్రధానకార్యదర్శి అప్పలరాజు కోరారు. ఆదివారం ఈ ఆనకట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడుమూళ్ల ఆనకట్ట కొట్టుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేముడునాయుడు, శివాజీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శంకరం బ్రిడ్జి వద్ద పిచ్చిమొక్కలు తొలగించాలి



శంకరం బ్రిడ్జిపై పెరిగిన పిచ్చిమొక్కలు

అనకాపల్లిటౌన్: మండలంలో శంకరం బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, పెద్దపెద్దగోతులను పూడ్చాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం ఆదివారం కోరారు. అనకాపల్లి నుంచి సబ్బవరం వెళ్లే శంకరం రహదారిలో బ్రిడ్జి వద్ద ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాటు పెద్దపెద్దగోతులు ఉండడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదురుంటున్నారని తెలిపారు.

28న దేవస్థానం ఖాళీస్థలం లీజుకు వేలం

అనకాపల్లిటౌన్: స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లో శ్రీ సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి దేవస్థానం ఆవరణలో ఖాళీ స్థలంపై ఏడాది పాటు హక్కు కల్పించేందుకు ఈనెల 28న వేలం పాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.ఆదినారాయణ, చైర్మన్ కె.ఎం.నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో హక్కు దక్కించుకునేవారు ఖాళీస్థలాన్ని అద్దెప్రాతిపదికన వివాహాది శుభకార్యక్రమాలకు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకూ(ఏడాదిపాటు) హక్కు పొందేందుకు దేవస్థానం ఆవరణలో టెండర్‌కమ్ బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శక్తి స్వరూపిణి నమోస్తుతే



దిమిలిలో భక్తులకు దర్శనమిచ్చిన బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారు



యలమంచిలి గాయత్రీ జ్ఞానపీఠంలో కనకదుర్గ అలంకరణలో అమ్మవారు



యలమంచిలిలో కనకదుర్గ రూపంలో వాసవీమాత

- కనకదుర్గ అలంకరణలో దుర్గమ్మ
- ఘనంగా కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం యలమంచిలి పట్టణంలో దిమిలి రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, గాంధీ నగరం ఆధ్యాత్మిక గాయత్రీ జ్ఞానపీఠంలో అమ్మవారు కనకదుర్గ రూపంలో దర్శనమిచ్చారు. అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పట్టణానికి సమీపంలో పెంజెరువు కనకదుర్గమ్మ ఆలయంలో వందల సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.పట్టణంలో పలుచోట్ల దుర్గా మండపాల వద్ద ప్రత్యేక పూజలు,అన్నసంతర్పణలు జరిగాయి. భవానీ దీక్ష చేపట్టిన భక్తులు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరి వెళ్లారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అందలాపల్లి భగీరథమ్మ గుడి,హరిపాలెం దుర్గమ్మ మందిరం, అచ్యుతాపురం, పూడిమడక, దొప్పెర్ల, మడుతూరు, దోసూరు, ఖాజీపాలెం, జగన్నాథపురం, మార్టూరుతో పాటు పలు గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పెదపాడులో అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహించారు. నృత్యాల నడుమ సారె ఊరేగింపు ఘనంగా జరిగింది.

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దిమిలి శాఖా గ్రంథాలయం వద్ద బాలా త్రిపురసుందరి దేవి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో లలితా పారాయణం నిర్వహించారు. పలు గ్రామాల్లో అమ్మవారి సన్నిధిలో భజనలు నిర్వహించారు.

మునగపాక: మండల వ్యాప్తంగా దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు చోట్ల భారీ అంబలం పూజలు నిర్వహించారు. మునగపాకలోని వైఎస్సార్ మార్కెట్, వాడ్రాపల్లిలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన అంబలం పూజలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఒంపోలు, మునగపాక తదితర చోట్ల ఆదివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, ద్వారం జానకీరామ్,పెతకంషెట్టి రామజోగినాయుడు,లీలా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో దేవీ శరన్నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దేవవరంలో ఆదివారం భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెనుగొల్లుకు చెందిన మహిళా భజన బృందం సభ్యులు ఆలపించిన భజన గీతాలు ఆకట్టుకున్నాయి. కాగిత, సారిపల్లిపాలెం, మనబానవానిపాలెం, చినదొడ్డిగల్లు, ఉపమాక తదితర గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాల వద్ద కుంకుమ పూజలు జరిగాయి. ఉపమాక వేంకటేశ్వరస్వామిఆలయంలో ఆండాళ్లమ్మవారి సన్నిధిలో ప్రతిరోజు కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. విజయదశమిని పురస్కరించుకుని మార్కెట్లకు దసరా శోభ వచ్చింది. సోమవారం విజయ దశమి పర్వదినాన్ని ఘనంగ జరుపుకొనేందుకు ప్రజలు అన్ని ఏర్పాట్లు చేశారు. కొబ్బరి కాయలు, పండ్లు, పువ్వులకు గిరాకీ ఏర్పడింది.తొమ్మిదిరోజులపాటు భవానీ దీక్షలు చేపట్టిన భక్తులు విజయవాడ దుర్గాదేవి దర్శనానికి ఆదివారం బయలు దేరి వెళ్లారు.

ఎస్.రాయవరం: తిమ్మాపురంలో కనక దుర్గ అమ్మవారు ఆదివారం భక్తులకు దుర్గమ్మ అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండపం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

గెడ్డపాలెంలో కనక దుర్గ అమ్మవారి మండపం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాము, నల్లపరాజు వెంకటరాజు,యల్లపు నాగు తదితరులు పాల్గొన్నారు.



దేవవరంలో అమ్మవారి విగ్రహం వద్ద భజన చేస్తున్న మహిళా భక్తులు



వాడ్రాపల్లిలో దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



మునగపాకలో దుర్గాదేవి అమ్మవారి అంబలం పూజలో భక్తులు



పెదపాడులో అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



మునగపాక మండలం తిమ్మరాజుపేటలో నిర్వహించిన సారె ఊరేగింపు

విజయదశమి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

- పెంజెరువులో కనకదుర్గమ్మ ఆలయం ముస్తాబు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): విజయదశమి ఉత్సవాలకు ఆలయాల్లో భారీగా ఏర్పాట్లు చేశారు. యలమంచిలి పట్టణానికి సమీపంలో పెంజెరువును ఆనుకుని ఉన్న కనకదుర్గమ్మ ఆలయం ముస్తాబైంది.

ఏటా దసరా రోజున ఈ ఆలయానికి యలమంచిలి పట్టణంతో పాటు పరిసర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి తరలి వస్తారు. ఈ సారి 10 వేలమందికి పైగా భక్తులు అమ్మవారి దర్శించుకోనున్నట్టు ఆలయ కమిటీ అంచనా వేసింది.అందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేసినట్టు ఆలయ అనువంశిక ధర్మకర్త కొటారు వరప్రసాద్ తెలిపారు. క్యూలైన్లలో తొక్కిసలాట లేకుండా ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొనే మహిళా భక్తులు ప్రత్యేకంగా రాకపోకలు సాగించేలా క్యూలైన్ల ఏర్పాటు చేశారు.దసరా సందర్భంగా అమ్మవారి ఆలయం,చుట్టుపక్కల విద్యుత్ దీపాలతో అలంకరించారు.



యలమంచిలి పెంజెరువు ఆలయంలో కనకదుర్గమ్మ

భగీరథమ్మ గుడి వద్ద ...

అచ్యుతాపురం(అనకాపల్లి): విజయదశమి ఉత్సవాలకు అందలాపల్లి భగీరథమ్మ ఆలయంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. భక్తులు హోమగుండాన్ని తొక్కి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ పరిసరాల్లో భారీ విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు.ఆలయంపై నుంచి కొండకర్ల–వాడ్రాపల్లి ఆవ అందాలు చూసి మైమరచిపోతారు.సమీప తోటల్లో వనసమారాధనలు సైతం నిర్వహిస్తుంటారు.ఆహ్లాదకంగా ఉంటే భగీరథమ్మ గుడి పరిసరాలను చూసేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. ఆదివారం రాత్రి ఆలయం వద్ద హోమం నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ స్థాయిలో భక్తులు విచ్చేశారు.



భగీరథమ్మ గుడి వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు



భగీరథమ్మ సన్నిధిలో భక్తులు

సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బంగారయ్య

ఎస్.రాయవరం: పేద ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని కేజీహెచ్ మాజీ ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య తెలిపారు. అడ్డురోడ్డులో బంగారయ్యట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా వైద్యశాల వద్ద ఆదివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారయ్య మాట్లాడుతూ తాను అడ్డురోడ్డు కేంద్రంగా ప్రజా వైద్యశాల నిర్వహించి, రోగులకు ఉచితంగా వైద్యసేవలందిస్తున్నానని చెప్పారు. కేజీహెచ్‌లో మెరుగైన సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నానని చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

ఎస్.రాయవరం: గుర్రాజుపేట శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి, ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు ఆదివారం తెలిపారు. గ్రామ శివారు తోటలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి ముగ్గురిని పట్టుకుని రూ.12,300 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. మిగిలిన వారు ఏడు మోటార్‌సైకిళ్లను వదిలి పరారయ్యారని, వాటిని కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కన్నూరుపాలెం హైస్కూలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల: మండలంలోని కన్నూరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1994–95 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పలకరించుకొని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకొని ఆనందంగా ఆట పాటలతో గడిపారు. సామూహికంగా భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు కె.చంద్రరావు, పి.ముత్యాలరావు, కె.వాసు, డి.రమణ,డి.శ్రీను, పి. అమ్మాజీ, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

నమూనా పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

కోటవురట్ల: జాతీయ ప్రతిభ ఉపకార వేతనం(ఎన్ఎంఎంఎస్) పరీక్షలో విద్యార్థులు విజయం సాధించాలని స్పందించే హృదయం సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో పది రోజుల పాటు 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్షకు నిర్వహించిన ఉచిత శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వారికి నమూనా పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్. రమేష్, ఎ.వి.ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షలో ప్రతిభ చూపి బహుమతులు పొందిన విద్యార్థులు

క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు

నర్సీపట్నం: క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని టౌన్ సీఐ ఎస్.గణేష్ పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్ సహకారంతో నర్సీపట్నం యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించేవారికి ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ పోటీల్లో 13 జట్లు పాల్గొన్నాయి. వ్యాపారి వెలగానారాయణరావు, నిర్వాహకులు కోటిబాబు, చంటి, చరణ్, పీడీలు కె.రమేష్, పి.వి.రమణ పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం



బీపీ చెక్ చేసుకుంటున్న దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్: విద్య, వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికప్రాధాన్యం ఇస్తున్నారని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీరాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలో తుమ్మపాల ఎస్‌వీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదికి రెండు సార్లు రక్తపరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీడీఎస్ వ్యవస్థాపకుడు కె. జోగినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి సహకరించాలి



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో త్వరలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. వచ్చేనెల 19న వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామ పెద్దలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తన వంతుగా ఆలయ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి బైపాస్ రోడ్డును ఆనుకుని 40 సెంట్లను కేటాయించేందుకు దేవదాయ శాఖ ద్వారా ఉత్తర్వులు అందాయన్నారు. ప్రతి ఒక్కరూ విరాళాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు విరాళాలు ప్రకటించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్పీటీసీ సభ్యులు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, ఉత్సవకమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, పెద్దలు సూరిశెట్టి కన్నారావు, మొల్లేటి సత్యనారాయణ,పెంటకోట వెంకట్, ఆదినారాయణ, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట వెంకటరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం రేపు

అనకాపల్లిటౌన్: మండలంలోని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 24న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.నరసింహారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో నలుగురు వైద్య నిపుణులు రోగులకు సేవలందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.